చిరస్మరణీయుడు మహానేత వైఎస్సార్

- ఘనంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- వాడవాడలా వైఎస్సార్‌సీపీ నాయకుల సేవా కార్యక్రమాలు


13వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ గొలగాని, కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: తెలుగు రాష్ట్రాల్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల అమలుతో చిరస్మరణీయుడిగా నిలిచారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కొనియాడారు. తూర్పు నియోజకవర్గంలో వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సోమవారం ఘనంగా జరిగింది. నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు.. వైఎస్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు. జీవీఎంసీ 9వ వార్డులో కార్పొరేటర్ స్వాతితో పాటు మేయర్ హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ 11వ వార్డులో మేయర్, జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీతతో పాటు మేయర్ హరి వెంకటకుమారి పాల్గొని వైఎస్‌కు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మేయర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయి స్థానం సంపాదించారన్నారు.

- జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో కార్పొరేటర్ స్వాతి, మేయర్ హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలులు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అప్పారావు, పిట్టారెడ్డి, కళావతి పాల్గొన్నారు.


16వ వార్డులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మొల్లి అప్పారావు

- 11వ వార్డులో ముస్తఫా కాలనీలో జీవీఎంసీ నైట్ షెల్టర్‌లో అనాథలు, వృద్ధులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేయర్ హరి వెంకటకుమారి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.మోహనరావు, షకీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.
- 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో సంతపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, ముద్దాడ పాపారావు, మోహన్, సూర్యారావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.
- 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో మేయర్ గొలగాని పాల్గొని ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బేత దుర్గారావు, డాక్టర్ నాయుడు పాల్గొన్నారు.


12వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అక్కరమాని

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మొల్లి అప్పారావు పార్టీ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

- జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు, వృద్ధులకు పండ్లు, కూల్ డ్రింక్స్, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు సూరిశెట్టి సన్యాసినాయుడు, వార్డు ఎస్సీ సెల్ నాయకుడు కణితి మరియదాసు, అనకాపల్లి రమణమ్మ, రాజేష్, పెద్ది రెడ్ల నూకరాజు, తదితరులు పాల్గొన్నారు. పేదలకు, వృద్ధులకు వైఎస్సార్‌సీపీ 15వ వార్డు అధ్యక్షుడు నరాల సత్తిబాబు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు కార్యదర్శి గొలగాని త్రినాథ్, వార్డు మహిళా అధ్యక్షురాలు ఆర్జి వెంకటలక్ష్మి, రామచంద్ర, మరియమ్మ, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.


11వ వార్డులో నైట్ షెల్టర్‌లో వృద్ధులకు భోజనాలు వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు


వృద్ధులకు పండ్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ 15వ వార్డు అధ్యక్షుడు నరాల సత్తిబాబు


సింహాద్రిపురంలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పేర్ల విజయచందర్, తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్లాజీ, సురేష్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు వేమన మందిరం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

- జీవీఎంసీ 22వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు పూలమాల వేసి అంజలి ఘటించారు.

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు గాంధీ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి కార్పొరేటర్ మువ్వల లక్ష్మి పూల మాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల నాగరాజు, మువ్వల సురేష్, బీఎల్ఏ కన్వీనర్లు పాల్గొన్నారు.

- పెదవాల్తేరులోని వైఎస్ఆర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ 20వ వార్డు నాయకుడు మద్ది పోలి రెడ్డి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రమాదేవి, పండరీ బాయి, పి.ప్రసాద్ రెడ్డి, బోర ఆంజనేయులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న 18వ వార్డు నాయకుడు పేర్ల విజయచందర్

సీతమ్మధార : ఆశీలమెట్టలోని వేమన మందిరం వద్ద ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శ్రీవేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకనందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోర కుమార్‌రెడ్డి, కొయ్య రమణారెడ్డి, కర్రి రామారెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, నీలాపు రమణారెడ్డి, డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, బాకి శ్యామకుమార్‌రెడ్డి, వై.ఈశ్వరరెడ్డి, మరడ శ్రీనివాసరెడ్డి, మద్ది ఈశ్వర రెడ్డి, హరిహరరెడ్డి, శీరపు దివాకర్‌రెడ్డి, యడ్ల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్‌ది సుస్థిరస్థానం

ఏయూ క్యాంపస్ : ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి సంక్షేమానికి కృషిచేసిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. మహానేత జన్మదినాన్ని పురస్కరించుకుని ఏయూలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.మోహన్‌బాబు, సిహెచ్ లక్ష్మణబాబు, ఖాదర్‌బాబా, డాక్టర్ జి.శాంతారావు, మండే సురేష్, సిహెచ్ సీతారాంరెడ్డి, మద్ది లక్ష్మణరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఏయూలో వైఎస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఆచార్యులు, ఉద్యోగులు


వేమన మందిరం వద్ద వైఎస్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న పల్లా దుర్గారావు


వైఎస్సార్‌సీపీ 22వ వార్డు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పీతల గోవింద్


పెదవాల్తేరులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి


పెదవాల్తేరులో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పోలి రెడ్డి, తదితరులు


వేమన మందిరం ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వేమన సంక్షేమ సంఘం సభ్యులు

క్లుప్తంగా

తడిపొడి చెత్తను వేర్వేరుగా అందించాలి


తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న జోన్-3 ఏఎంహెచ్‌వో ప్రసాదరావు

ఆరిలోవ: జీవీఎంసీ జోన్-3 ఏఎంహెచ్‌వో ప్రసాదరావు సోమవారం ఎంవీపీ రైతుబజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌లో స్టాళ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం రైతులు, వ్యాపారులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డబ్బాలలో వేయాలని సూచించారు. ప్రమాదకరమైన మేకులు, ఇనుప తీగలు, పగిలిన గాజు పెంకులు తదితర వాటిని ప్రత్యేకంగా ఎర్ర రంగు బుట్టలో వేయాలని చెప్పారు. చెత్త వేరు చేయడంలో వ్యాపారులు అంతా తప్పకుండా నియమాలు పాటించాలని ఆయన సూచించారు.

డెంగ్యూపై అవగాహన అవసరం


గురుకులం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

ఆరిలోవ: డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా మలేరియా విభాగం సిబ్బంది శ్రీకృష్ణాపురంలో సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం అవగాహన కార్యక్రమం న్విహించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ వ్యాధుల వల్ల ఎలాంటి ప్రమాదం జరుగుతుంది, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలు వివరించారు. అనంతరం శ్రీకృష్ణాపురంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహిత, హెల్త్ అసిస్టెంట్ ఎ.సత్యనారాయణ, ఫార్మాసిస్ట్ ఎస్.వై.నాయకుడు, గురుకులం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ


ప్రసంగిస్తున్న వెంకట శేషమ్మ

ఏయూ క్యాంపస్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటారు వాహన చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ సేవా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎల్.వి ప్రసాద్, ఆచార్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి పెంచాలని వినతి

ఎంవీపీ కాలనీ: డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి అర్హతను 46 ఏళ్లకు పెంచాలని ఏయూ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ చిరంజీవిని సోమవారం ఎంవీపీ కాలనీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు సిర్లా శ్యామ్, దంతేశ్వర్ పట్నాయక్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా నోటిఫికేషన్స్ లేకపోవడంతో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం జనరల్ కేటగిరీ అభ్యర్థుల ఉద్యోగ వయోపరిమితిని పెంచాలని కోరారు.

ఎయిడెడ్ సిబ్బందిని లెక్చరర్స్‌గా పరిగణించాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులను లెక్చరర్స్‌గా మాత్రమే పరిగణించాలని వర్సిటీ ఆచార్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబును వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎయిడెడ్ కళాశాలల లెక్చరర్స్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ వంటి హోదాలు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వం కూడా దీనిపై ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని అమలు చేయాలని కోరారు. పరిపాలన సంబంధమైన పదవుల్లో వారు కొనసాగడం సరికాదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.ప్రేమానందం, ఆచార్య నల్ల సత్యనారాయణ, డాక్టర్ లిల్లీ గ్రేస్, డాక్టర్ సాల్మన్ బెన్నీ, తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆచార్యులు

విత్తన బంతులతో హరిత విశాఖ సాధ్యం


మొక్క నాటుతున్న విద్యార్థులు, గ్రీన్ క్లైమేట్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: విత్తన బంతులు చల్లడం వల్ల హరిత విశాఖ సాధ్యమవుతుందని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం విత్తన బంతులను తయారు చేసి అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఆహారంగా తీసుకుంటున్న పండ్ల విత్తనాలను విత్తన బంతులుగా తయారు చేసి మైదాన, కొండ ప్రాంతాలతో పాటు సముద్ర తీరాల్లో వెదజల్లితే హరిత విశాఖ రూపొందుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

ఎంవీపీ కాలనీ: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ పూర్వ గవర్నర్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు సూచించారు. నగరంలోని ఓ హోటల్లో లయన్స్ క్లబ్ వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. క్లబ్ సేవలు అన్ని వర్గాల వారికి చేరువ చేయాలన్నారు. రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ ఏడాది లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 2024–25 ఏడాదికి లయన్స్ క్లబ్ వాల్తేర్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బి.దేముడు, కార్యదర్శిగా ఆచార్య ఎంవీ జగన్నాథరాజు, ఉపాధ్యక్షులుగా ఆచార్య పి.కింగ్, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఆచార్య ఎన్‌వీవీఎస్ ప్రసాద్, జిల్లా కోశాధికారి ఆచార్య రామకృష్ణ పాల్గొన్నారు.


ఆచార్య ఉమామహేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

గోరింటాకుతో వారాహి మాతకు అలంకరణ

అల్లిపురం: అల్లిపురం షిర్డీసాయి దర్బార్‌లో కొలువైన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం స్వప్న వారాహి పూజ ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గోరింటాకు పాదులతో విశేషంగా అలంకరించారు.

వీఎంఆర్‌డీఏ పార్కులో పారిశుధ్యంపై అలసత్వం తగదు


పార్కులో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పార్కులో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహించవద్దని వీఎంఆర్‌డీఏ కమిషనర్ వి.రవీంద్ర అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన సోమవారం వీఎంఆర్‌డీఏ పార్కును సందర్శించారు. పార్కులో పలు సౌకర్యాలపై సూచనలు చేశారు. కుక్కల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈ రాజు, రేంజ్ అధికారి శ్యామల, డీఈ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

గెడ్డ స్థలాల ఆక్రమణకు అడ్డుకట్ట


బాలాజీనగర్ గెడ్డ అంచున చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని పాక్షికంగా తొలగించిన గోడలు


శ్రీహరినగర్‌లో గెడ్డ అంచున నిర్మించిన అక్రమ నిర్మాణానికి పాక్షికంగా తొలగించిన గోడలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పరిధి గెడ్డ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకట్ట వేశారు. అయితే తూతూ మంత్రంగా గోడలు తొలగించి మమ అనిపించడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. గెడ్డ అంచున పచ్చదనం కోసం కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. కొంబాల కొండ వెనుక భాగం నుంచి కైలాసనగర్, డ్రైవర్స్ కాలనీ, బాలాజీనగర్, గాంధీనగర్ వరకు గెడ్డ అంచున ఖాళీ స్థలాలున్నాయి. జీవీఎంసీ అధికారులు పచ్చదనం ఏర్పాటు చేయడానికి కేటాయించిన ఆ స్థలాలను కొందరు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. బాలాజీనగర్ వద్ద గెడ్డ అంచున స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టగా దీనికి సమీపంలో బాలాజీనగర్, శ్రీహరినగర్ మధ్యలో గెడ్డ అంచున మరో వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. వీటి పక్కన కూడా మరికొన్ని ఖాళీ స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయి. దీనిపై 'యథేచ్ఛగా ఆక్రమణలు' శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం ఆయా అనధికారిక నిర్మాణాలను పరిశీలించారు. కట్టిన గోడలను పాక్షికంగా తొలగించి వదిలేశారు. పిల్లర్లు, శ్లాబులు వదిలేసి ఇటుకలతో కట్టిన గోడలు తొలగించి మమ అనిపించడంపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయం, జోన్–2 టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గోడలు తొలగించామని, మిగతా నిర్మాణాన్ని ఆయా యజమానులనే తొలగించాలని ఆదేశించినట్లు టౌన్ ప్లానింగ్ స్క్వాడ్ సిబ్బంది రమేష్ తెలిపారు. వారు 2, 3 రోజుల్లో పూర్తిగా తొలగించకపోతే మళ్లీ తామే ఆయా నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

వ్యాస రచన పోటీలకు విశేష స్పందన


వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జనాభా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జనాభా పోకడలు–సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు దిశగా పురోగతి' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు ఈ నెల 11న జరిగే ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జనాభా అధ్యయన కేంద్రం సంచాలకుడు, ఏయూ స్టాటిస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.